మనసు అగ్నిలా దహిస్తున్నా ఆమె పడుపు వృత్తి చేయడానికి కారణం?

పతివాడ మోహన్ శ్రీనివాసరావు కథ

# అరుంధతి

ఒక్క కుదుపుతో లారీ ఆగడంతో కేబిన్‌లో కూర్చుని కునికిపాట్లు పడుతున్న నేను తుళ్లిపడి లేచాను.

"ఏం జరిగింది" అడిగాను డ్రైవర్ని.

"ఏమోసార్ చూడాలి" అంటూ డ్రైవర్ టార్చ్ తీసుకుని కిందకు దిగాడు. అతనితోపాటు క్లీనర్ కుర్రవాడు కూడా.

నేను వాచీలో టైం చూశాను. పదకొండు గంటలయింది. చుట్టూ చీకటిగా, ఏదో అరణ్యంలో ఉన్నట్లుగా ఉంది.

నేను విశాఖపట్నంలో ఉన్న ఒక మాన్యుఫాక్చరింగ్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాను. కలకత్తాలోని ఒక కంపెనీ మా కంపెనీని తయారుచేయమని ఆర్డరుచేసిన గూడ్స్‌ని ఆ కంపెనీకి డెలివరీ చేసి వస్తున్నాను. అసలు అది నా జాబ్ కాకపోయినా, ఆ జాబ్‌మీద వెళ్లవలసిన రామారావు 'రిక్వెస్ట్'మీద, ట్రావెలింగ్ అంటే నాకున్న 'ఇంట్రెస్ట్'మీద నేను 'సరే' అన్నాను.

కిందకు దిగిన వాళ్లు ఎంతసేపటికి లారీ ముందుకు రాకపోవడంతో నేను కేబిన్‌లోనుండి దిగి లారీ ముందుకు వచ్చాను. వాళ్లిద్దరూ లారీ కింద ఉండి టార్చ్ వెలుగులో ఏదో చూస్తూ మాట్లాడుకుంటున్నారు.

"ఏమయింది గురువులూ" అడిగాను నేను డ్రైవర్ని.

నా మాటలు విని బయటకు వస్తూ "యాక్సిల్ రాడ్ విరిగిపోయింది సార్" చెప్పాడు డ్రైవర్.

"మరిప్పుడెలాగ" అడిగాను నేను అతణ్ణి

"ఎలా ఏం ఉంది సార్. దీనివి విప్పి



వెల్డింగ్ చేయించడమో, కొత్తది కొని తీసుకువచ్చి వెయ్యడమో చెయ్యాలి'' చెప్పాడు అతను.

''ఎంత టైమ్ పడుతుంది'' అడిగాను నేను, అది అంత తొందరగా జరిగే పనికాదని తెలిసినా.

''తెల్లవారి పోవచ్చు సార్. ఎందుకంటే అది తీసి ఈ దారినపోయే ఏ లారీవాడినో

పట్టుకుని వెనక్కి వెళ్ళి అక్కడ వెల్డింగు చేయించుకుని, మళ్లా అటునుండి మరో బండిమీద ఇక్కడకు వచ్చి బిగించేసరికి ఎలా లేదన్నా అయిదారుగంటలు పడుతుంది. అయినా అదంతా మేం చూసుకుంటాంగానీ మీరు వెళ్లి కేబిన్‌లో పడుకోండి సార్'' చెప్పాడు డ్రైవర్.

''సరేలే'' అని చెప్పాను నేను.

''ఒరే, అది విప్పడానికి టూల్స్ తియ్యరా'' అన్నాడు డ్రైవర్, క్లీనరు కుర్రవాడితో ఆ పనిలో పడ్డాడు.

డిసెంబరు నెల కావడంతో చాలా చలిగా వుంది. అందులోను ఆరుబయలు కావడంతో మరీ వణికించేస్తుంది. ఈ చలిలో ఆ కేబిన్‌లో ఎలా పడుకోవాలా అని ఆలోచిస్తున్నాను నేను.

జేబులోనుండి సిగరెట్ పెట్టె తీసి ఒక సిగరెట్ వెలిగించి గట్టిగా ఒక దమ్ము లాగాను. చలి కాస్త తగ్గినట్లనిపించింది. అలా సిగరెట్ కాలుస్తూ ఒక నాలుగడుగులు ముందుకు వేసాను. కాస్త దూరంగా చిన్న వెలుతురు కనిపించింది నాకు.

నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఈ హైవేలో, అందులోను ఊరికి ఇంత దూరంగా ఎవరో అక్కడ వుండి వుండటం.

నేను వెనక్కి లారీ దగ్గరకు వచ్చి డ్రైవర్‌ని అడిగాను. ''గురువులూ అక్కడ దూరంగా వెలుతురు కనిపిస్తోంది, ఏమిటది''

''ఓ అదా సార్, హోటల్. అక్కడ మన ఆంధ్రా భోజనం కూడా దొరుకుతుంది సార్. అసలే మీరు కేంప్‌లో సరిగ్గా ఏమి తినడం లేదుగా. అక్కడికి వెళ్ళండి. మేం పని పూర్తయిన తర్వాత అక్కడికి వచ్చేస్తాము లెండి'' చెప్పాడు అతను.

నేను ''సరే'' అని చెప్పి అటువైపు నడిచాను.

నిజమే, గురువులు చెప్పినట్లుగానే నేను ఈ కేంప్‌లో సరిగ్గా భోజనం చెయ్యలేకపోయాను. కారణం ఒరిస్సా భోజనం నచ్చకపోవడం, బెంగాలీవాళ్ల చపాతీలు తింటే వేడి చేస్తుందనే భయం వల్లను.

గురువులు, క్లీనరు కుర్రవాడు మాత్రం అలవాటుమీద బాగానే తినేస్తున్నారు. నేనిక ఇంటికి వెళ్లేంతవరకు మంచి భోజనం చెయ్యలేనేమో అనుకున్నాను. కానీ ఇక్కడ అక్కడ ఆంధ్రా భోజనం దొరుకుతుందనగానే నా ప్రాణం లేచివచ్చినట్లుగా వుంది.

నేను కొంచెం దూరంలోనుండే గమనించాను డ్రైవరు చెప్పిన హోటల్ని. అది ఒక పాక. నేను దగ్గరగా వెళ్లాను. నాలుగు బెంచీలు, నాలుగు బల్లలు ఉన్నాయి అందులో. ఒక పక్కగా పొయ్యి, టీ కాచుకునే సామాను, ఒక పది గ్లాసులు, నాలుగు సీసాల్లో బిస్కట్లు ఉన్నాయి. నా ఆశ ఒక్కసారిగా చచ్చిపోయింది, ఆ హోటల్ వాతావరణం చూడగానే.

నేను చుట్టూ చూశాను. ఒక మూలగా ఉన్న మడత కుర్చీలో ఒక ముసలాయన పడుకుని ఉన్నాడు. ఇంకెవ్వరూ లేరు. నేను చిన్నగా దగ్గాను.

అతను ఉలికిపాటుగా లేచి ''ఎవరు బాబు'' అన్నాడు.

నేను ఒక బల్లమీద కూర్చుంటూ ''భోజనం ఉందా తాతా, ఆంధ్రాభోజనం''

అని అడిగాను.

"ఆ ఉంది బాబు. మీరొక్క క్షణం అలా కూర్చుంటే వండించేస్తాను" అని నాతో చెప్పి "అమ్మా అరూ" అని కేక వేశాడు లోపలికి చూస్తూ.

• అప్పుడు గమనించాను నేను, ఆ పాకలో నే మరొక కర్రి తలుపు, ఆ వెనుక మరో గది ఉండటాన్ని.

"ఆ వస్తున్నా తాతయ్యా" అన్న సమాధానం, ఆ వెనకే తలుపు తీసుకుని వచ్చింది ఒక అందమైన యువతి. ఆమెని చూస్తూనే నేను ఆశ్చర్యంతో అలా చూస్తుం డిపోయాను, ఆమె అందాన్ని. మన పట్నవా సపు స్త్రీల పైపై మెరుగు అందాలు ఈమె సహజ సౌందర్యం ముందు ఎంత తీసికట్టో అనిపించింది నాకు.

ఆమె నిద్రమత్తుతో ఉండటం వలనో ఏమో జారిన పైటను సవరించుకోకుండానే "ఆ ఏమిటి తాతయ్యా" అంది చిన్నగా ఆవలిస్తూ.

"వీరికి భోజనం కావాలటమ్మా, ఆంధ్రా భోజనం" అన్నాడు ఆ ముసలాయన.

అప్పుడు గమనించింది ఆమె నన్ను. వెంటనే సిగ్గుగా పైట సవరించుకుని, "ఒక పదినిమిషాలు కూర్చోండి, వండేస్తాను" అని చెప్పి పొయ్యి దగ్గరకు వెళ్లింది.

ఆ ముసలాయన నా దగ్గరగా వచ్చి కూర్చుని నా గురించి అడిగాడు. నేను వివరంగా చెప్పాను.

"అలా అయితే ఈ రాత్రికి ఇక్కడే ఉండిపోండి బాబు. ఆ పక్కన మరో గది ఉంది. అందులో పడుకోవచ్చు మీరు" అన్నాడు అతను.

నేను ఆనందంతో 'సరే' అన్నాను. ఈ చలిలో ఆ లారీ కాబిన్‌లో పడుకునే శ్రమ లేనందుకు.

అతను ఇంకా ఏదేదో మాట్లాడుతూనే ఉన్నాడు. నేను అతని మాటలు వింటూనే మధ్యమధ్యలో ఆమెవైపు చూస్తున్నాను. ఆమెకూడా మధ్యమధ్యలో నన్ను గమనిస్తూ



## లాయర్!

విదంబరాన్ని కోదండం ఆశ్చర్యంగా అడిగాడు "మన లాయరు మన తరఫున వాదించకుండా పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెప్పే ప్రతి మాటకీ తాళం వేస్తున్నాడేమిటి?"

"సగం సగం ఫీజులిస్తే అలాగే వుంటుంది. ఈ లాయర్లంతా అంతే..."

"ఆ...!"

—పోలిశెట్టి బ్రదర్స్ (వడ్లమూరు)

నే ఉంది.

తను చెప్పినట్లుగా పది నిమిషాలలో కాకపోయినా ఒక ఇరవై నిమిషాలలో వేడివేడి భోజనం వడ్డించింది, నా ముందు విస్తరిలో.

అన్నం, సాంబారు, బంగాళాదుంపల కూర్మా, అప్పడాలు, పెరుగు. మళ్లీ చాలారోజుల తర్వాత తృప్తిగా భోజనం చేసాను నేను.

ఆమెకి థాంక్స్ చెప్పి ఇరవై రూపాయల నోటు అందించాను నేను.

ఆమె పది రూపాయలు వెనక్కి ఇవ్వబోయింది. "వద్దు వుంచండి. ఆ పది ఇంత అర్ధరాత్రి పూట మిమ్మల్ని శ్రమ పెట్టినందుకనుకోండి" అన్నాను నవ్వి.

"ఇందులో శ్రమ ఏముంది. ఎవరొచ్చినా వండి వడ్డించేదాన్ని. తీసుకోండి" అంది ఆమె.

ఇక తప్పదని ఆ నోటు తీసుకుని జేబులో పెట్టుకున్నాను.

"మీరు వెళ్లి ఆ గదిలో పడుకోండి బాబు. అమ్మ అరూ బాబుగారికి చాపా దిండు ఇవ్వమ్మా" అన్నాడు ముసలాయన ఆమెతో.

"అలాగే తాత" అని అతనితో చెప్పి "మీరు రండి" అంది నావైపు తిరిగి.

నేను ఆమెని అనుసరించాను. ఆ ముసలాయన మళ్లీ ఆ మడత కుర్చీలో కూర్చుని నిద్రపోవడానికి ఉపక్రమిస్తున్నాడు.

లోపలి గదిలో చిన్న దీపం వెలుగులో గమనించాను నేను, ఆ గదిలో ఒక మూలగా నులకమంచంమీద ఎవరో పడుకుని ఉండటాన్ని. ఇక ఆ గదిలో ఎలా పడుకుంటానని ఒక క్షణం తటపటాయించి అక్కడే తలుపు దగ్గర నిలబడిపోయాను.

ఆమె వెనక్కి తిరిగి చూసి, ఆ విషయాన్ని గ్రహించినట్టుగా, "ఆమె మా అమ్మ. అనారోగ్యం మనిషి. మంచం దిగలేదు. మీరు పడుకునే గది ఈ పక్కగా ఉంది. రండి ఫర్వాలేదు" అంది.

నేను ఆ పక్కగా ఉన్న గదిలోకి వెళ్లాను. ఆమె వెనుకగా. ఆమె దీపం వెలిగించింది. నేను చుట్టూ చూశాను. గది చిన్నదే అయినా చాలా నీట్‌గా ఉంది. ఆమె ఒక పక్కగా ఉన్న చాప నేలమీద పరచి దానిమీద దిండు వేసింది.

"మంచినీళ్లు తెమ్మంటారా" అడిగింది ఆమె.

నేను తీసుకురమ్మని చెప్పాను. ఆమె వెళ్లింది. ఈలోగా నేను బూట్లు విప్పి ఒక మూలగా పెట్టి, చాపమీద కూర్చున్నాను.

ఆమె మంచినీళ్ల గ్లాసు తీసుకువచ్చి ఒక పక్కగా పెట్టి "ఏమన్నా కావలిస్తే పిలవండి' ' అంది.

నేను 'సరే'నని, "మీ పేరు అరుణా" అని అడిగాను, ముసలాయన ఆమెని 'అరూ ' అని పిలవడం గుర్తుంచుకుని.

"కాదు, అరుంధతి" చెప్పింది ఆమె.

ఆ పేరెందుకో నాకు చాలా నచ్చింది. అదే చెప్పాను ఆమెతో, "మీ పేరు బాగుంది"

ఆమె నవ్వి బయటకు వెళుతూ, తలుపు దగ్గర ఆగి ఒక క్షణం నా కళ్లలోకి చూసి, తలుపు దగ్గరకు జారవేసి వెళ్లిపోయింది.

నాకొక క్షణం ఒళ్లు జివ్వున లాగినట్లనిపించింది ఆమె చూపుకు. నేనింతవరకు ఏకపత్నీ వ్రతుడ్నే. ఇంతకుముందెప్పుడూ ఏ స్త్రీ అందంగాని, చూపులుగాని నన్నింతగా 'టెంప్ట్' చేయలేదు. కానీ ఆమెని చూసిన మొదటి క్షణంలోనే నా మనసు నా అధీనం తప్పిన విషయం నాకు తెలుసు.

నాకెందుకో ఒక్కసారి, ఒకే ఒక్కసారి ఆమెని నా దగ్గరగా తీసుకుంటే ఎంత బాగుంటుంది అనిపించింది. శారీరక సుఖం కోసం కాకున్నా, ఎందుకో ఆమెకి దగ్గరవ్వాలనే ఒక విధమైన కోరిక. అది 'ఇది' అని నిర్వచించలేని భావన.

నా ఆలోచనలు ఇలా ఉండగా తలుపు దగ్గర చిన్నగా చప్పుడైంది. నేను ఉలికిపాటుగా కళ్లు తెరిచి అటువైపు చూశాను. గుమ్మానికి జారబడి నిలబడి వుంది అరుంధతి అభిసారికలా.

అంతా అర్ధరాత్రిపూట స్నానం చేసినట్లుంది. తెల్లచీర, జాకెట్టు, తలనిండా పూలు.

నాకొక క్షణం కలో నిజమో అర్థం కాలేదు. ఆమె ఒక నిముషం అలా నిలబడి చిన్నగా నవ్వుతూ నా దగ్గరగా వచ్చి చాపమీద కూర్చుంది.

నేనింకా ఆశ్చర్యంలోనుంచి తేరుకోలేదు ఆమె నామీదకు వంగుతూ, పక్కగా ఉన్న దీపాన్ని ఆర్పేసింది 'ఉఫ్'మని ఊది.

'బాబు, మీ లారీ డ్రైవర్ వచ్చాడు బాబు' ఆ ముసలాయన తట్టి లేపడంతో ఉలిక్కిపడి లేచాను నేను. పక్కన అరుంధతి లేదు.

"ఆ వస్తున్నానని చెప్పు తాతా" అని చెప్పాను అతనితో. అతను 'సరే'నని బయటకు వెళ్లిపోయాడు.

ఒళ్లంతా ఒకటే నొప్పులుగా ఉంది. ముఖ్యంగా మోకాళ్ళు. రాత్రి సుఖంలో నలిగిన మల్లెలు పక్కనిండా పడి ఉన్నాయి. నేను లేచి డ్రస్ చేసుకుని షూస్ వేసుకున్నాను.

# మగువల కన్నీరు



*స్త్రీలు సాధారణంగా ప్రతి చిన్న విషయానికీ కంటతడి పెడ్తారు! అయితే పురుషులు అందుకు విరుద్ధంగా చిన్న చిన్న విషయాల్ని పట్టించుకోరు! మన దేశంలోనేకాదు! ప్రపంచంలోని చాలా దేశాలలో స్త్రీలు ఇలాగే సున్నిత మనస్తత్వాన్ని కలిగి వుంటారట! ఏడుపు విషయంలో పురుషులు దృఢ మనస్కులైనా... కడుపులో పుండు, గుండెజబ్బుల విషయంలో మాత్రం స్త్రీలకంటే చాలా ముందే వుంటారట!* — హాపిటర్

నేను గదిలోనుండి బయటకు వస్తుండగా లోపలికి వచ్చింది అరుంధతి. తలకు స్నానం చేసినట్లుంది. తడి ఇంకా ఆరలేదు. నేను చిన్నగా నవ్వి ఆమెని దగ్గరకు తీసుకుని బుగ్గమీద ముద్దుపెట్టుకుని “వెళ్తున్నాను, మళ్ళీ త్వరలోనే వస్తానులే” అని చెప్పి, ఆమెని వదిలి బయటకు నడవబోయాను.

రుంలోగా “ఏమండీ” అని పిలిచింది అరుంధతి.

నేను వెనక్కి తిరిగి “ఏమిటి” అని అడిగాను.

ఆమె ఏదో చెప్పబోయి, చెప్పడానికి తటపటాయిస్తూ ఆగిపోయింది.

“ఫర్వాలేదు చెప్పు” అన్నాను నేను.

“అది... అదే... నిన్న రాత్రి జరిగినదానికి... డబ్బులు...” అంది ఆమె తలదించుకుని మెల్లగా.

నాకొక క్షణం ఆమె ఏం మాట్లాడినది అర్థం కాలేదు. అర్థమైన మరుక్షణం నాకు విపరీతమైన అసహ్యం కలిగింది ఆమెమీద.

“అంటే నువ్వు... నువ్వొక వేశ్యవన్న మాట...” అన్నాను నేను.

ఆమె ఒక క్షణం ఏమీ మాట్లాడలేదు. ఆ తరువాత నెమ్మదిగా తలపైకెత్తి నా కళ్లల్లోకి సూటిగా చూస్తూ, “అవును, నేను వేశ్యనే. అమ్మ మందులకి, మా ఆకలి తీరడానికి డబ్బు కావాలి. డబ్బు సంపాదించడానికి నాకు తెలిసిన మార్గం ఇదొక్కటే” అంది ఆమె.

“ఏం, ఈ హోటల్ మీద వచ్చే ఆదాయం సరిపోదా” అడిగాను నేను కోపంగా.

“ఒకప్పుడు సరిపోయేది. ప్రైవేటు బస్సులు ఉండేటప్పుడు. అప్పుడు మాకు చేతినిండా పని, మా నాన్నకు జేబునిండా డబ్బు. కానీ గవర్నమెంటు వాళ్ళు ప్రైవేటు బస్సులు తీసేసి ఆర్టీసి బస్సులు వెయ్యడంతోను, అవి ఇక్కడ ఆగకపోవడంతోనూ మాకు ఇబ్బందులు మొదలయ్యాయి. అప్పటివరకు సంపాదించినది సంపాదించినట్లుగానే మా నాన్న తాగుడికి ఖర్చయిపోయింది. ఇంక మిగిలింది అప్పులే. తాగి తాగి నాన్న చచ్చిపోయాడు. అమ్మ మంచం పట్టింది. మిగిలింది నేను, తాతయ్యా. ఇక ఈ హోటల్ అంటారా, పేరుకే ఇది హోటల్. వచ్చేపోయే లారీవాళ్లను, పచ్చిగా చెప్పాలంటే మీలాంటి 'కస్టమర్ల'ను ఆకర్షించడానికే దీనిని మూయకుండా నడుపుతున్నది. చాలామంది ఇక్కడ ఆగేది భోజనం కోసం కాదు. నా కోసం, నేనిచ్చే సుఖం కోసం.

ఇప్పుడు చెప్పండి. నన్ను పెంచి పెద్దచేసిన తాతయ్యను, నాకు జన్మనిచ్చిన తల్లిని బ్రతికించుకోవడం కోసం నేను వేశ్యగా మారడం తప్పంటారా, మీరే చెప్పండి” అంతవరకూ ఎంతో ఉద్విగ్నంగా మాట్లాడిన ఆమె, ఒక్కసారిగా మౌనమైపోయి మొహాన్ని చేతుల్లో దాచుకుని ఏడ్వసాగింది.

నేను స్థాణువులా నిలబడిపోయాను చాలాసేపు. కొంతసేపటికి తేరుకున్న నేను నా పర్స్‌లో ఉన్న నోట్లన్నిటిని తీసి ఆమె చేతుల్లో ఉంచి, వెనక్కి తిరిగి వచ్చేశాను బయటకు, ఆమె పిలుస్తున్నా వినిపించుకోకుండా.

బయట గురువులూ, క్లీనరు కుర్రాడు నాకోసమే చూస్తున్నారు. “వస్తాను తాత”

అని ఆ ముసలతనితో చెప్పి లారీవైపు నడిచాను నేను.

లారీ కొంచెం దూరం పోయిన తర్వాత "రాత్రి బాగా నిద్రపట్టిందా సార్. ఎంత గుంజేసిందేమిటి అది మీ దగ్గర" అడిగాడు గురువులూ నావైపు తిరిగి.

నేను చటుక్కున మొహం అటువైపుకి తిప్పి కిటికిలోనుండి బయటకు చూస్తుండి పోయాను, నా బుగ్గమీదకు జారిన కన్నీటి చుక్క అతనికి కనిపించకుండా జాగ్రత్తపడుతూ.

*




